సాక్షి సంగారెడ్డి

బుధవారం ౹ 5 ౹ జూన్ ౹ 2024

జహీరా బాద్‌షా

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ విజయం

- బీజేపీ అభ్యర్థి పాటిల్‌పై 46,188 ఓట్ల మెజారిటీ
- మూడో స్థానానికి పడిపోయిన బీఆర్ఎస్



ప్రొఫైల్

పేరు : సురేశ్‌కుమార్ షెట్కార్
పుట్టిన తేదీ: 8.08.1960
వయస్సు : 64 ఏళ్లు
విద్యార్హత : బీఎస్సీ
భార్య : ఉమాదేవి షెట్కార్
సంతానం : ఇద్దరు కూతుళ్లు
డాక్టర్ గిరిజ షెట్కార్,
చిన్నకూతురు శివానీషెట్కార్,
కుమారుడు రాకేశ్ షెట్కార్
తల్లి: చంద్రమ్మ షెట్కార్
తండ్రి: శివరావ్ షెట్కార్
సొంత గ్రామం: నారాయణఖేడ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:

జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌పై సుమారు 46,188 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ షెట్కార్ ఆధిక్యం సాధించారు. నియోజకవర్గంలో మొత్తం 16.41 లక్షల ఓట్లు ఉండగా, గత నెల 13న జరిగిన పోలింగ్ ప్రక్రియలో 12.25 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఇందులో సురేశ్‌షెట్కార్‌కు 5,28,418 ఓట్లు రాగా, బీజేపీ నుంచి బరిలోకి దిగిన బీబీ పాటిల్‌కు 4,82,230 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్ 1,72,078 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జరిగింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, ఈవీఎం ఓట్లను లెక్కించారు. మొత్తం 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరపగా, తొలి రౌండ్ నుంచి మొదలు కుని చివరి రౌండ్ వరకు ప్రతి రౌండ్‌లోనూ షెట్కార్ ఆధిక్యం సాధించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి మొత్తం 46,188 ఓట్ల మెజారిటీ సాధించిన షెట్కార్‌కు జహీరాబాద్ పార్లమెంట్ స్థానం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి గెలుపు పత్రం అందజేశారు.

అందరి కృషి ఫలితమే..

కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల కృషి, అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతోనే ఎంపీగా రెండో పర్యాయం విజయం సాధించినట్లు సురేశ్ షెట్కార్ తెలిపారు. విజయం సాధించిన అనంతరం రుద్రారం.. గీతం వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రం బయట మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దశ, దిశ నిర్దేశంతో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ ఆశీస్సులతో తనను అభ్యర్థిగా ప్రకటించారన్నారు. 2009 నుంచి 2014 వరకు తాను ఎంపీగా ఉన్నానని, ఈ సమయంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయంలో కీలకంగా వ్యవహరించానని గుర్తు చేశారు. తన గెలుపు కోసం కృషి చేసిన, ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసి..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో షెట్కార్‌కు నారాయణఖేడ్ ఎమ్మెల్యే స్థానానికి కాంగ్రెస్ టికెట్ దక్కింది. అయితే ఈ టికెట్‌ను డాక్టర్ సంజీవరెడ్డి కూడా ఆశించారు. ఈ క్రమంలో ఇద్దరు నేతలు ఒక అవగాహనకు వచ్చారు. ఎమ్మెల్యే టికెట్‌ను త్యాగం చేసి డాక్టర్ సంజీవరెడ్డికి ఇచ్చిన షెట్కార్‌కు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కగా.. ఇప్పుడు విజయం వరించింది.

పార్టీ మారినా బీబీపాటిల్‌కు దక్కని విజయం

బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన బీబీపాటిల్ ఎంపీ ఎన్నికలకు ముందు పార్టీ మారారు. బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. పాటిల్‌కే కమలం పార్టీ టికెట్‌ను కేటాయించింది. దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ హవా కొనసాగడంతో జహీరాబాద్‌లో కూడా గెలుపు వరిస్తుందని బీజేపీ భావించింది. కానీ హస్తం గాలి వీయడంతో ఓటమి పాలయ్యారు.

మూడో స్థానానికి గాలి అనిల్‌కుమార్

బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి అనిల్‌కుమార్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2019లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో అనిల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మెదక్ నుంచి పోటీ చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. తనకు పట్టున్న మెదక్ స్థానం నుంచి బీఆర్ఎస్ టికెట్‌ను ఆశించారు. కానీ అ పార్టీ నాయకత్వం జహీరాబాద్ నుంచి బరిలోకి దించింది. చివరకు మూడోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

3.73 శాతం ఓట్ల తేడా..

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీజేపీ కంటే కేవలం 3.73 శాతం ఓట్లు ఎక్కువగా వచ్చాయి. బీజేపీ అభ్యర్థి పాటిల్‌కు 39 శాతం ఓట్లు రాగా, షెట్కార్ 42.73 శాతం ఓట్లు సాధించారు. మూడో స్థానంలో నిలిచిన గాలి అనిల్‌కు 13.92 శాతం ఓట్లు వచ్చాయి.



కలెక్టర్ క్రాంతి చేతుల మీదుగా ధ్రువపత్రాన్ని అందుకుంటున్న సురేశ్ శెట్కార్

పదేళ్ల అనంతరం.. విజయం

2008లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడింది. ఈ స్థానానికి 2009లో జరిగిన తొలిసారి ఎన్నికల్లో సురేశ్‌షెట్కార్ ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బీబీపాటిల్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో షెట్కార్ పోటీ చేయాలని భావించినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థిత్వం దక్కలేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్‌రావు బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్న షెట్కార్‌ను విజయం వరించింది.



ఝరాసంగంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మెదక్ మొనగాడు

బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ జయకేతనం

- కాంగ్రెస్ అభ్యర్థిపై 39,139 ఓట్ల మెజారిటీ
- ఆద్యంతం ఉత్కంఠ రేపిన కౌంటింగ్



ప్రొఫైల్

పేరు: మాధవనేని రఘునందన్‌రావు
వయస్సు: 56 ఏళ్లు
తల్లిదండ్రులు : భగవంతరావు, భారతి
భార్య : మంజుల దేవి
సంతానం : సింధు
విద్యార్హత: బీఎస్సీ, బీఈడీ, ఎల్ఎల్‌బీ
సొంత గ్రామం: దుబ్బాక మండలం బొప్పాపూర్
వృత్తి : జర్నలిస్టుగా పనిచేశారు. ప్రస్తుతం న్యాయవాది
రాజకీయ నేపథ్యం: 2020లో దుబ్బాకలో జరిగిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

సాక్షి, సిద్దిపేట:

గులాబీ కంచుకోటలో బీజేపీ వికసించింది. మెదక్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై 39,139 ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. కాగా, రఘునందన్‌కు 4,71,217 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 4,32,078, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 3,96, 790 ఓట్లు వచ్చాయి. మంగళవారం మెదక్ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ నర్సాపూర్ బీవీఆర్‌టీ కళాశాలలో జరిగింది. రఘునందన్ గెలుపొందడంతో మెదక్ లోక్‌సభ పరిధిలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబురాలను పార్టీ శ్రేణులు, అభిమానులు జరుపుకొన్నారు.

రౌండ్‌రౌండ్‌కు టెన్షన్..

కౌంటింగ్ రౌండ్ రౌండ్‌కు ఉత్కంఠ రేపింది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కొన్ని రౌండ్లలో ఆధిక్యాన్ని చూపాయి. కౌంటింగ్ మొత్తం 24 రౌండ్‌లు.. అందులో బీజేపీకి 15, కాంగ్రెస్‌కు 5, బీఆర్ఎస్ 4 కు రౌండ్లు ఆధిక్యం వచ్చింది.

అందరి చూపు మెదక్ వైపే

రాష్ట్రంలోని అందరి చూపు మెదక్ వైపే ఉంది. బీఆర్ఎస్ గెలుపు అవకాశాలు తక్కువగా ఉన్నాయని మెదక్ లోక్‌సభ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుస్తారని ఆపార్టీ శ్రేణులు ఆశగా ఎదురు చూశారు. ఒక వైపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గం కావడంతో సర్వత్ర ఆసక్తి నెలకొంది.

నా విజయం మెతుకుసీమకు అంకితం

నా విజయం మెతుకుసీమ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఎంపీగా విజయం సాధించిన అనంతరం నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీలో మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ లాంటి మంత్రుల పుట్టినిల్లయిన మెదక్‌లో భారీ మెజార్టీతో తనను గెలిపించిన మెతుకుసీమ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. ధన బలం పొంగిపొర్లినా.. జనబలమే గెలిచిందన్నారు. బీఆర్ఎస్‌లోని హేమాహేమీలంతా ఒక్కటై తనను ఓడించేందుకు కృషి చేశారని, అయినా ప్రజలు, కార్యకర్తలు తన విజయానికి నిరంతరం కృషిచేశారని చెప్పారు. తన ప్రచారంలో పాల్గొన్న బీజేపీ, జాతీయ ఇతర రాష్ట్రాల నేతలకు, కార్యకర్తలకు ఎంఆర్‌పీఎస్ నాయకులకు రఘునందన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

వికసించిన కమలం

25 ఏళ్ల తరువాత బీజేపీ విజయం

- అప్పుడు ఆలె నరేంద్ర.. ఇప్పుడు రఘునందన్

మెదక్‌జోన్/పాపన్నపేట: బీఆర్ఎస్ కోటలో కమలం వికసించింది. మెదక్ సీటుపై ఆశలు పెట్టుకున్న గులాబీ క్యాడర్ ఆశలు ఆవిరయ్యాయి. బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు 39,139 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తన ప్రత్యర్థులు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిల అంచనాలకు అందని విధంగా విజయాన్ని కైవసం చేసుకున్నారు. 1999లో అప్పటి బీజేపీ అభ్యర్థి ఆలె నరేంద్ర(టైగర్) విజయం సాధించారు. మళ్లీ 25 ఏళ్ల తర్వాత మెతుకుసీమలో కాషాయ జెండా రెపరెపలాడింది.

చాపకింద నీరులా..

మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన మంత్రి మోదీ చరిష్మా పని చేసిందనే చెప్పాలి. కనీసం క్యాడర్ లేని పల్లెల్లో కూడా ఆయన ప్రభావం కనిపించింది. ఒకప్పుడు యువత, విద్యాధికులు మాత్రమే బీజేపీ వైపున ఉండగా.. ఈసారి దేశం కోసం ఓటు వేయాలని మోదీ ఇచ్చిన నినాదం అందరినీ ఆలోచింపజేసింది. ఎలాంటి ఆర్భాటం లేకుండానే చాపకింది నీరులా పల్లెపల్లెల్లో చొచ్చుకెళ్లింది. రామమందిర ప్రారంభోత్సవానికి గాను ప్రతి ఇంటి నుంచి అక్షింతల సేకరణ బలమైన ఓటుగా మారిందని తెలుస్తోంది. ఏడాదికి మూడు సార్లు రూ. 2 వేల చొప్పున కిసాన్ సమ్మాన్ నిధి, పంటల బీమాతో పాటు ఉపాధి హామీ పథకంలో రోజు కూలీ రూ. 300 అట్టడుగు వర్గాలను ఆకర్షించింది. అన్నింటికీ మించి కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం ప్రతి గడపకూ చేరింది. అంతేకాకుండా ఈ లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థిని సైతం బీజేపీ ముందుగా ప్రకటించటం, ప్రచారం సైతం మిగతా పార్టీలకన్నా 20 రోజుల ముందుగా మొదలు పెట్టారు. బూత్ లెవల్ నుంచి సాగిన ప్రణాళికబద్ధమైన ప్రచారం సత్ఫలితాలిచ్చింది. అందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రచారం చేయడం కూడా కలిసివచ్చింది.



కలెక్టర్ రాహుల్ రాజ్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రఘునందన్‌రావు



దుబ్బాకలో బీజేపీ నాయకుల సంబరాలు

పోస్టల్ బ్యాలెట్‌లో బీజేపీ సత్తా

చెల్లని ఓట్లు 84

నారాయణఖేడ్: జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో బీజేపీ సత్తా చాటింది. మెజారిటీ ఓట్లు ఆపార్టీ ఎంపీ అభ్యర్థి పాటిల్‌కు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ రెండో స్థానం, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మూడో స్థానంలో నిలిచారు. బ్యాలెట్ ఓట్లు మొత్తంగా 11,650 పోల్ అయ్యాయి. తొలి రౌండ్‌లో 6,889, 2వ రౌండ్‌లో 4,761 ఓట్లను అధికారులు లెక్కించారు. ఇందులో పాటిల్‌కు 6,207 ఓట్లు రాగా.. మొదటి రౌండ్‌లో 3,716, రెండో రౌండ్‌లో 2,491 ఓట్లు సాధించారు. షెట్కార్ 4,499 ఓట్లు పొందగా.. మొదటి రౌండ్‌లో 2,734, రెండో రౌడ్‌లో 1,765 ఓట్లు సాధించారు. అయినా కానీ పాటిల్ 1,708 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఇక గాలి అనిల్ కుమార్‌కు కేవలం 666 ఓట్లు పొందారు. అందులో 304 మొదటి రౌండ్‌లో, 362 ఓట్లు రెండో రౌండ్‌లో వచ్చాయి. మిగతా అభ్యర్థుల వారీగా పరిశీలిస్తే కొత్తబాలాజీ బస్వరాజ్‌కు 11 ఓట్లు, గుర్రపు మచ్చెందర్‌కు 9, చావగంటి మణికి 14, టీడీఎస్ మణికి 27, మాలెపు మోహన్‌రెడ్డికి 7, రోమల బాబు దుర్గయ్యకు 2, అశోక్ తలారీకి 6, కమ్మరి ఆనందేశ్వర్‌కు 3, జైపాల్ నాయక్ జాదావత్‌కు 51, సద్దాంకు 1, మమాదేవ్ స్వామి మఠంకు 4, బి.మారుతిరావుకు 4, ఎండీ యాకుబ్ షరీఫ్‌కు 5, రమేష్ సజ్జపుర్‌కు 2, ఎస్.రాజుకు 3, సత్యనారాయణగౌడ్‌కు 1, నోటాకు 44 ఓట్లు పడ్డాయి. కాగా, 84 ఓట్లు చెల్లుబాటు కాలేదు. మొదటి రౌండ్‌లో 48, రెండో రౌండ్‌లో 36 మొత్తం 84 ఓట్లు చెల్లుబాటు కాలేదు.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నా

కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్



మెదక్ జోన్/పటాన్ చెరు: ప్రజా తీర్పును గౌరవిస్తున్నానని, ఎప్పటికీ ప్రజల మధ్య ఉంటూ వారికి సేవ చేస్తానని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. కౌంటింగ్ ముగిశాక చిట్కుల్‌లో ఆయన మాట్లాడుతూ, మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన ఏఐసీసీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఓటేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఓటమిని అంగీకరిస్తున్నా..

- ఓటరు దేవుళ్లకు కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మెదక్‌జోన్: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం వెలువడిన ఫలితాల అనంతరం ఆయన మాట్లాడారు. తన ఓటమిని మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నట్లు చెప్పారు. జాతీయ పార్టీల ప్రభావంతో అనూహ్య ఫలితాలు వచ్చాయని, బీఆర్ఎస్ పార్టీకి గెలుపోటములు కొత్తవి కావన్నారు. కేవలం పదేళ్లలో తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎంపీగా విజయం సాధించిన రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా ప్రజల మధ్యనే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. నిరంతరం ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. తనకు ఓటువేసిన మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ఓటర్లందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన మాజీ సీఎం కేసీఆర్, తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ బాధ్యులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

మెదక్ లోక్‌సభ సెగ్మెంట్‌లో ఓట్ల వివరాలు

అసెంబ్లీ స్థానం	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్
సిద్దిపేట	65,501	62,823	33,174
దుబ్బాక	66,714	50,873	31,641
మెదక్	40,776	67,374	55,588
నర్సాపూర్	54,372	51,811	72,376
పటాన్‌చెరు	54,581	1,03,775	94,294
సంగారెడ్డి	27,874	70,310	75,287
గజ్వేల్	85,432	56,811	65,539

జహీరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో ఓట్ల వివరాలు

అసెంబ్లీ స్థానం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
నారాయణఖేడ్	78,280	58,018	28,194
ఆందోల్	82,612	66,118	34,186
జహీరాబాద్	1,03,129	67,651	23,018
జుక్కల్	63,577	61,832	20,747
బాన్సువాడ	66,348	57,459	21,267
ఎల్లారెడ్డి	63,446	79,335	20,715
కామారెడ్డి	66,527	85,610	23,285
పోస్టల్ బ్యాలెట్	4,499	6,207	666

క్లుప్తంగా

వర్గల్ పూలే మహిళా డిగ్రీ కళాశాలలో..

- నేటి నుంచి అడ్మిషన్లు



వర్గల్‌లోని గురుకుల డిగ్రీ కళాశాల

వర్గల్(గజ్వేల్): 2024–25 విద్యా సంవత్సరంలో వర్గల్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. గురుకుల ప్రవేశ పరీక్ష రాసి అర్హత పొందిన మొదటి జాబితా విద్యార్థినులకు ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు వెరిఫికేషన్, అడ్మిషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు మూడు జిరాక్స్ ప్రతులు, 15 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రూ.2,225 (కళాశాలలో చెల్లించేందుకు)నగదుతో రావాలన్నారు. కళాశాలలో విద్యార్థినులకు ఉచిత భోజన వసతితో పాటు మూడు జతల యూనిఫామ్స్, నోటు పుస్తకాలు, ఒక జత షూ, ట్రాక్ సూట్, బ్లాంకెట్, బెడ్ షీట్ అందజేస్తామన్నారు. ఉద్యోగం కోసం ప్రాంగణ ఎంపికలు ఉంటాయన్నారు.

ప్రజల తీర్పును శిరసావహిస్తాం: సునీతారెడ్డి



నర్సాపూర్ : మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి రెండవ స్థానం దక్కడంపై స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి స్పందిస్తూ ప్రజా తీర్పును శిరసావహిస్తామని అన్నారు. తమకు తక్కువ ఓట్లు వచ్చినా రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సంక్షేమం ధ్యేయంగా అవసరమైనప్పుడు ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌కు అండగా ఉంటారని, వాటిలో మంచి ఫలితాలు సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు, పార్టీకి అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

నేలవాలిన మర్రి వృక్షం



రోడ్డుపై అడ్డంగా మర్రి వృక్షం

కల్హేర్(నారాయణఖేడ్): గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో భారీ మర్రి వృక్షం నేలవాలింది. మంగళవారం నిజాంపేట మండలం బాచేపల్లిలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల సమీపంలో పాత జాతీయ రహదారిపై మర్రి వృక్షం అడ్డంగా పడింది. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రహదారి పక్కన మర్రి వృక్షం మొదలు కింద నిప్పు అంటుకొని కాలిపోయింది.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి



మృతి చెందిన గేదె వద్ద రైతు

జిన్నారం(పటాన్‌చెరు):విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన ఘటన గుమ్మడిదల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. గుమ్మడిదల గ్రామానికి చెందిన పాదాల కృష్ణకు మూడు గేదెలు ఉన్నాయి. ఎప్పటిలాగే మేత కోసం గుమ్మడిదల విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఉన్న పొలంలోకి తీసుకెళ్లాడు. గాలి, వాన బీభత్సంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. మేతకు వెళ్లిన మూడు గేదెలు ప్రమాదవశాత్తు ఆ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు కృష్ణ బోరున విలపించాడు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలియజేయడంతో ఘటనా స్థలాన్ని ఏడీ శ్రీకాంత్, ఏఈ రవీందర్ సందర్శించారు. తమశాఖ తరపున బాధిత రైతుకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



గీతం యూనివర్సిటీలో కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



నర్సాపూర్‌లో ఓట్ల లెక్కింపు చేపడుతున్న నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు



నర్సాపూర్‌లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తున్న సిబ్బంది



గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు



ఈవీఎంలను తీసుకొస్తున్న సిబ్బంది



కౌంటింగ్ సిబ్బందితో ఎంపీ రఘునందన్ రావు



నర్సాపూర్‌లో పోలీసుల బందోబస్తు

రౌండ్లవారీగా ఓట్లు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 44 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు 4,71,217 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు 4,32,078 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి 3,96,790 ఓట్లు సాధించారు. బీజేపీ 3,6,8,9,10,11,12, 13,15,16,17,18,19,20,23 రౌండ్లలో, కాంగ్రెస్ పార్టీ 2,7,14,21,22. బీఆర్ఎస్ 1,4,5,19 రౌండ్లలో లీడ్ ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో సైతం బీజేపీ ఆధిక్యం కనబర్చింది.

–సాక్షి, సిద్దిపేట

రౌండ్ నంబర్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	లీడ్
1	20,754	19,477	22,754	1,542 (బీఆర్ఎస్)
2	21,267	21,622	20,445	355 (కాంగ్రెస్)
3	23,365	22,174	20,914	1,191 (బీజేపీ)
4	19,668	19,125	22,198	2,530 (బీఆర్ఎస్)
5	21,721	19,689	21,772	51 (బీఆర్ఎస్)
6	25,222	18,633	18,391	6,589 (బీజేపీ)
7	21,717	22,148	17,743	431 (కాంగ్రెస్)
8	22,262	19,323	18,110	2,939 (బీజేపీ)
9	24,838	19,099	15,149	5,739 (బీజేపీ)
10	22,557	22,342	15,515	215 (బీజేపీ)
11	24,686	20,885	16,710	3,801 (బీజేపీ)
12	26,332	20,572	15,588	5,760 (బీజేపీ)
13	22,872	22,053	18,830	819 (బీజేపీ)
14	21,359	21,482	19,887	123 (కాంగ్రెస్)
15	22,526	21,866	20,516	660 (బీజేపీ)
16	22,065	20,807	19,525	1,258 (బీజేపీ)
17	24,207	21,587	20,816	2,620 (బీజేపీ)
18	20,750	20,569	19,789	181 (బీజేపీ)
19	17,873	18,306	18,315	09 (బీఆర్ఎస్)
20	15,197	13,546	13,798	1,399 (బీజేపీ)
21	9,666	10,667	9,475	1,001 (కాంగ్రెస్)
22	8,237	8,271	7,098	34 (కాంగ్రెస్)
23	4,636	3,656	2,370	980 (బీజేపీ)
పోస్టల్ బ్యాలెట్	7,740	4,179	1,540	3,260 (బీజేపీ)

పోస్టల్ బ్యాలెట్‌లు 14,315 ఓట్లు పోలు కాగా అందులో ఇన్ వ్యాలిడ్ ఓట్లు 307, రిజెక్ట్ ఓట్లు 665 ఇలా మొత్తం 972 ఓట్లు చెల్లని ఓట్లుగా అధికారులు గుర్తించారు. నోటాకు 4,617 ఓట్లు పడ్డాయి.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో..

అసెంబ్లీ నియోజకవర్గం	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్
సిద్దిపేట	1,05,514	23,201	23,206
దుబ్బాక	97,879	44,366	32,568
మెదక్	76,969	13,657	87,126
నర్సాపూర్	88,112	22,865	79,555
పటాన్‌చెరు	1,05,389	19,963	98,296
సంగారెడ్డి	83,112	20,821	74,895
గజ్వేల్	1,11,684	66,653	32,568

మంత్రి దామోదరను కలిసిన సురేశ్ షెట్కార్



మంత్రి దామోదరతో సురేశ్ షెట్కార్

జహీరాబాద్: జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన సురేశ్ షెట్కార్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు. మంగళవారం రాత్రి మంత్రిని ఆయన నివాసంలో కలిసి విజయోత్సవ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా షెట్కార్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.డీ తన్వీర్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో యువకుడు మృతి

- జీవాలు మేపడానికి వెళ్లగా ప్రమాదం
- మూడు మేకలు సైతం మృత్యువాత



జైపాల్ మృతదేహం

పెద్దశంకరంపేట(మెదక్): పిడుగుపడి యువకుడితో పాటు మూడు మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని బూర్గుపల్లి చంద్యానాయక్ తండాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన జైపాల్(25) గ్రామ శివారులో మేకలు మేపడానికి వెళ్లాడు. అకస్మాత్తుగా పిడుగుపడి జైపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మేకలు సైతం మృత్యువాత పడ్డాయి. మృతుడు జైపాల్‌కి గతేడాదే వివాహం జరుగగా ప్రస్తుతం అతడి భార్య కమ్లీబాయి గర్భవతి. దీంతో తండాలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో..



నెహ్రూ(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాఘవానితండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన సేనావత్ నెహ్రూ(35) అనే యువకుడు అతడి బావమరిదికి చెందిన రెస్టారెంట్ మెయింటనెన్స్ చేస్తున్నాడు. మంగళవారం రెస్టారెంట్‌లో బోర్డును సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలింది. దీంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమణితో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసీఆర్ ఇలాకలో మెజారిటీ

గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కే ఆధిక్యం

- కాంగ్రెస్‌పై 19 వేల పైచిలుకు మెజారిటీ
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాస్త తగ్గుముఖం
- భారీగా పుంజుకున్న కాంగ్రెస్
- సత్తా చాటుకున్న బీజేపీ



నర్సాపూర్ బీవీఆర్ఐటీలో కౌంటింగ్ కేంద్రం

గజ్వేల్: మాజీ సీఎం కేసీఆర్ 'ఇలాకా' గజ్వేల్‌లో ప్రస్తుత మెదక్ ఎంపీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్‌కే మెజారిటీ లభించింది. ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 85,432 ఓట్లు దక్కాయి. 65,539 ఓట్లు దక్కించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు రెండో స్థానంలో నిలిచారు. 56,811ఓట్లు దక్కించుకున్న విజేత బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఈ అసెంబ్లీ పరిధిలో కాస్త వెనుకబడి మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. మొత్తానికి గజ్వేల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 19,893 ఓట్ల మెజార్టీని సాధించారు.

నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీలో 22 రౌండ్లుగా సాగిన ఓట్ల లెక్కింపు అత్యధిక రౌండ్లలో బీఆర్ఎస్ ఆధిక్యాన్ని కనబరిచింది. మొత్తంగా ఇక్కడ 2,25,607ఓట్లు పోలవగా, మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు 2,07,782 ఓట్లు దక్కగా, మిగిలిన అభ్యర్థులకు 17,825 ఓట్లు పోలయ్యాయి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో పోల్చుకుంటే నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ తగ్గడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతుంది. గతేడాది డిసెంబర్ 3న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కేసీఆర్ తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45,031 ఓట్ల భారీ మెజారిటీ సాధించిన సంగతి తెల్సిందే. తిరస్కరణకు గురైన 39 ఓట్లు మినహాయిస్తే మొత్తంగా ఇక్కడ పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకొని 2,32,417 ఓట్లు పోల్ కాగా.. అందులో కేసీఆర్‌కు 1,11,684 ఓట్లు దక్కాయి. సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 66,653 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డికి 32,568 ఓట్లు వచ్చాయి. బరిలో ఉన్న మరో 41 మంది అభ్యర్థులకు 21,512 ఓట్లు వచ్చాయి. ఇందులో భాగంగానే నోటాకు 832 ఓట్లు పడ్డాయి.

ఎంపీ ఎన్నికల్లో మారిన సీను..

ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 25 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ తగ్గడం పార్టీ శ్రేణులను కలవరానికి గురి చేస్తుంది. పోలింగ్‌కు ముందు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో కీలకంగా పని చేసిన మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, మాజీ ఫుడ్స్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితోపాటు గతంలో బీఆర్ఎస్‌లో పని చేసి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీలో చేరి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అధికార పార్టీలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు చేరడం కాంగ్రెస్‌కు కలిసి వచ్చింది. అంతేకాకుండా గ్రామస్థాయిలో కీలకంగా ఎంతోమంది నేతలు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఫలితంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 32,568 ఓట్లకే పరిమితమైన కాంగ్రెస్ ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో 65,539 ఓట్లు దక్కించుకోవడం ద్వారా భారీగా పుంజుకున్నది.

నిలదొక్కుకున్న బీజేపీ..

బీజేపీ విషయానికొస్తే గత అసెంబ్లీ ఎన్నికల్లో 66,653 ఓట్లు దక్కించుకున్న ఆ పార్టీ ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో 56,811 ఓట్లను దక్కించుకుంది. గజ్వేల్‌లో ఈటెల రాజేందర్ ఓటమి తర్వాత ఇక్కడ కీలకంగా పని చేసిన నేతలంతా కాంగ్రెస్‌లోకి వెళ్లడం వల్ల కొంత నష్టం జరిగినా, ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో ఒకరకంగా ఆ పార్టీ సత్తా చాటుకుందనే చెప్పాలి. గ్రామ స్థాయిలో ఈ పార్టీకి కేడర్ లేకున్నా గట్టిగా పోటీలో నిలబడటం చర్చనీయాంశంగా మారింది. ఇక పోతే బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన గజ్వేల్ రింగు రోడ్డు, డబుల్ ఇండ్ల పంపిణీ, బస్టాండ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉండటం, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల సమస్యలు కూడా ఇంకా అపరిష్కృతంగా ఉండటం తదితర సమస్యలు బీఆర్ఎస్ మెజారిటీ తగ్గడానికి కారణాలుగా నిలుస్తున్నాయి.

రఘునందన్‌కు కలిసొచ్చిన 2024

సాక్షి, సిద్దిపేట: మెదక్ ఎంపీగా గెలుపొందిన మాధవనేని రఘునందన్ రావుకు 2024వ సంవత్సరం కలిసొచ్చింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా రఘునందన్ రావు పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత 2020లో దుబ్బాక ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రఘునందన్ రావు గెలుపొందారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా రఘునందన్ పోటీ చేసి ఓటమి చెందారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

బీజేపీకి భారీగా పెరిగిన ఓట్లు

గత అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఆరు చోట్ల బీఆర్ఎస్ గెలుపొందగా ఒక చోట కాంగ్రెస్ గెలుపొందింది. అప్పటితో పోల్చితే బీజేపీకి అనూహ్యంగా ఓట్లు పెరిగాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకున్నారు. దీంతో బీజేపీకి భారీగా ఓటర్లు మద్దతు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే 2,59,591 అధికంగా ఓటు సాధించి విజయంను సొంతం చేసుకుంది.

దుబ్బాక నుంచే ఎంపీలు..

- వరుసగా మూడు సార్లు ఇక్కడి వాసులే..
- రెండు సార్లు ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి
- తాజాగా రఘునందన్‌రావు



రఘునందన్‌రావు



కొత్త ప్రభాకర్‌రెడ్డి


దుబ్బాక: మెదక్ ఎంపీగా మూడు సార్లు వరుసగా దుబ్బాక నియోజకవర్గానికి చెందిన వారే ఎంపిక కావడం విశేషం. 2014 ఉప ఎన్నికతో పాటు , 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. తాజాగా మెదక్ ఎంపీగా మాధవనేని రఘునందన్ రావు గెలుపొందడంతో దుబ్బాక ప్రత్యేకంగా నిలిచింది. వరుసగా మూడు పర్యాయాలు మెదక్ ఎంపీగా దుబ్బాకకు చెందిన వారే ఎంపిక కావడం సర్వత్రా చర్చనీయాంశంగా తయారైంది. 2 సార్లు ఎంపీగా ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కొత్త ప్రభాకర్ రెడ్డిది దుబ్బాక మండలం పోతారం కాగా, ప్రస్తుతం ఎంపీగా గెలిచిన మాధవనేని రఘునందన్‌రావుది ఉమ్మడి దుబ్బాక మండలం బొప్పాపూర్. ఇలా వరుసగా 3 పర్యాయాలు దుబ్బాకకు చెందిన వారే ఎంపిక కావడంతో ఈ ప్రాంతంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ ఎమ్మెల్యేగా.. ఎమ్మెల్యే ఎంపీగా

ఎంపీగా ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. అలాగే దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్న రఘునందన్ రావు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి చేతిలో ఓటమి చెందడం తాజాగా బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఇలా ఎంపీ ఎమ్మెల్యేగా.. ఎమ్మెల్యే ఎంపీగా గెలుపొందడంపై ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

బీటలువారిన గులాబీ కోట

- ఉత్కంఠగా సాగిన కౌంటింగ్
- ఊహించని తీర్పుతో ఉలిక్కిపడ్డ శ్రేణులు



మెదక్‌జోన్ : తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన మెతుకుసీమలో ఓటమే ఎరుగని గులాబీ కోటకు బీటలువారాయి. రెండు దశాబ్దాల గెలుపు వీరులు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. 2004నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి ఆలె నరేంద్ర ఎంపికయ్యారు. 2009లో విజయశాంతి, 2014లో కేసీఆర్, 2019లో కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించారు. కానీ 2024 ఎన్నికల్లో భారీ ఆశలతో ఎన్నికల్లోకి దిగిన వెంకట్రామిరెడ్డి ఘోర పరాజయం పాలయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినా.. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కచ్చితంగా బీఆర్ఎస్ గెలుస్తుందని ఆ పార్టీనేతలు ఆకాంక్షించారు. కాని ఓటమి తప్పలేదు.

ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో వారే ఉన్నా..

మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వాటిలో నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ గెలుపొందింది. ఈ క్రమంలో మెదక్ పార్లమెంట్ స్థానంలో ఎలాగైనా బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని అందరికీ సుపరిచితుడు, ఆర్థికంగా బలమైన వ్యక్తి వెంకట్రామిరెడ్డిని బరిలోకి దింపారు. అయినా ఓటమి తప్పలేదు.

పోస్టల్ బ్యాలెట్లలో 50 శాతం బీజేపీకే

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పోస్టల్ ఓట్లలో సగానికి పైగా ఓట్లు సాధించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్లు 14,315 నమోదు కాగా అందులో బీజేపీకి 7,440, కాంగ్రెస్‌కు 4,179, బీఆర్ఎస్‌కు 1,540 ఓట్లు పడగా వాటిలో 307 ఓట్లు ఇన్‌వ్యాలిడ్ కాగా 665 ఓట్లను తిరస్కరించారు. అలాగే నోటాకు 35 పడగా 149 ఓట్లు ఇతరులకు పడ్డాయి.

కాంగ్రెస్ రెండో స్థానానికి పరిమితం..

పార్లమెంట్ పరిధిలో పరిధిలో విజయదుందుభి మోగించిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మెదక్ నియోజకవర్గంలోనూ 11 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించారు. నియోజకవర్గంలో మొత్తం 2,16,740 ఓట్లు ఉండగా అందులో 1,75,409 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీజేపీకి 67,374 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 55,588 వచ్చాయి. బీఆర్ఎస్‌కు 40,776 వచ్చాయి.

సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నా..

2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనంపల్లి రోహిత్‌రావు 10,157 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. అనంతరం 5 నెలల వ్యవధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు 11,786 ఓట్ల మెజార్టీ రావటం గమనార్హం. దీంతో కమలం కార్యకర్తల్లో జోష్ నెలకొంది.